# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-05-2025　　　　　సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ పాకిస్తాన్ దేశాలు కొద్ది సేపటి క్రితం కాల్పుల విరమణకు అంగీకరించాయి.
- ❖ భారత సాయుధ దళాలు ఏ మతపరమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకోలేదని వింగ్ కామండర్ వ్యోమిక సింగ్ ఉద్ఘాటించారు.
- ❖ దేశ సమగ్రతను సార్వభౌమత్వాన్ని కాపాడటానికి భారత త్రివిధ దళాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయని కమాండర్ రఘు ఆర్ నాయర్ తెలిపారు.
- ❖ ఉగ్రవాదంపై రాజీ లేని పోరాటంలో మాత్రం భారత్ తన వైఖరిని కొనసాగిస్తుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.
- ❖ నైరుతి ఋతుపవనాలు మే 27న కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) ప్రకటించింది.

======================

భారత్, పాకిస్తాన్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈరోజు మధ్యాహ్నం 3 గంటల 35 నిమిషాలకు పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) భారత డీజీఎంఓకు ఫోన్ చేసి ఈ మేరకు చర్చలు జరిపారు. ఈరోజు సాయంత్రం 5 గంటల నుండి కాల్పుల విరమణతో పాటు సైనిక చర్య కూడా నిలిపివేస్తున్నామని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ఈ అంశంపై మరే  ఇతర ప్రదేశంలోనూ చర్చలు జరపలేదని ఆయన స్పష్టం చేశారు. ఈనెల 12వ తేదీన మరో మారు ఇరుదేశాల డీజీఎంఓల మధ్య చర్చలు జరగనున్నాయని విక్రమ్ మిస్రీ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య కాల్పుల విరమణకి సంబందించి అవగాహన కుదిరిందని.. దీనికి కట్టుబడి ఉండాలని తమకు ఆదేశాలు వచ్చాయని భారత త్రివిధ దళాలు వెల్లడించాయి. కాల్పుల విరమణ ప్రకటన అనంతరం రక్షణ మంత్రిత్వ శాఖ ఈరోజు సాయంత్రం పాత్రికేయుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మాట్లాడుతూ... ఆపరేషన్ సింధూర్ పేరిట చేపట్టిన దాడులు భారత వ్యతిరేక కార్యకలాపాలకు ఉపయోగించే ఉగ్రవాద శిబిరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నాయని తెలిపారు. భారత సాయుధ దళాలు ఏ మతపరమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకోలేదని ఉద్ఘాటించారు. భారతదేశం ఒక లౌకిక దేశమని భారత సైన్యం రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. భారత సైన్యం మసీదులపై దాడులు చేసిందని పాకిస్తాన్ తప్పుగా ప్రచారం చేసిందని వ్యోమికా సింగ్ వివరిస్తూ ...

(వాయిస్ 35 సెకన్లు)

ఆదే విధంగా పాకిస్తాన్ తన JF-17తో భారత దేశ S-400, బ్రహ్మోస్ క్షిపణి స్థావరాన్ని ధ్వంసం చేసిందని తప్పుగా ప్రచారం చేసిందని కల్నల్ సోఫియా ఖురేషి చెప్పారు. సిర్సా, జమ్మూ, పఠాన్‌కోట్, భటిండా, నలియా, భుజ్‌లోని భారత వైమానిక స్థావరాలు దెబ్బతిన్నాయనేది కూడా తప్పుడు సమాచారం అని సోఫియా ఖురేషి పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

విరామం

======================

దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని కాపాడటానికి భారత త్రివిధ దళాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయని కమాండర్ రఘు ఆర్ నాయర్ పేర్కొన్నారు. పహల్గామ్‌లో ఉగ్రదాడులు జరిగినప్పటి నుండి భారత రక్షక దళాలు సమర్ధవంతంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాయని వెల్లడించారు. కాల్పుల విరమణ ప్రకటన అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ రోజు కుదిరిన అవగాహన ఒప్పందానికి కట్టుబడి ఉంటామని పునరుద్ఘాటించారు. దేశ రక్షణ కోసం అవసరమైన ఏ కార్యకలాపాలను చేపట్టడానికైనా పూర్తిగా కార్యాచరణపరంగా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అయితే భవిష్యత్ లో పాకిస్తాన్ ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే అత్యంత ధీటుగా ఎదుర్కొంటామని కమాండర్ రఘు ఆర్ నాయర్ హెచ్చరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

======================

భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణపై విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ స్పందిస్తూ.. కాల్పుల విరమణ, సైనిక చర్యలను నిలిపివేయడంపై ఇరుదేశాలు ఈ రోజు ఒక అవగాహనకు వచ్చాయన్నారు. కానీ ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న సరే దానిపై రాజీ లేని పోరాటం విషయంలో మాత్రం భారత్ తన వైఖరిని కొనసాగిస్తుందని జైశంకర్ స్పష్టం చేశారు.

======================

ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ATC) నుండి అనుమతి లభించడంతో ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ధామ్‌కు హెలికాప్టర్ సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. దేశంలోని అన్ని విమాన ప్రయాణాలను సమీక్షించిన అనంతరం ATC ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అనుమతి లేకపోవడంతో కొన్ని గంటలు మాత్రమే కేదార్‌నాథ్ కు హెలికాప్టర్ సేవలు నిలిపివేయగా ఇప్పుడు చార్‌ధామ్ యాత్ర ఎటువంటి అంతరాయాలు లేకుండా సజావుగా జరుగుతోంది. ఇప్పటివరకు, 4 లక్షలకు పైగా భక్తులు పవిత్ర పుణ్యక్షేత్రాలను సందర్శించారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఎలాంటి వదంతులను పట్టించుకోవద్దని సామాజిక మాధ్యమం ఎక్స్ లో భక్తులను కోరారు. భక్తులకు

సురక్షిత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

======================

దేశంలోకి నైరుతి రుతుపవనాలు ఈ సంవత్సరం ముందే ప్రవేశించనున్నాయి. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించడం ద్వారా దేశమంతటా వర్షాలు ప్రారంభమవుతాయి. జులై 8 నాటికి అవి దేశమంతా విస్తరిస్తాయి. కానీ ఈ సంవత్సరం జూన్ 1 కంటే ముందుగా ఈనెల 27వ తేదీన కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) ఈరోజు ప్రకటించింది. ఈ సారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని కూడా వాతావరణ శాఖ తెలిపింది. భారత ఉపఖండంలో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే ఎల్‌నినో పరిస్థితులకు అవకాశాలు లేవని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా రాబోయే రెండు, మూడు రోజులకు సంబంధించిన వాతావరణ సమాచారాన్ని IMD శాస్త్ర వేత్త ఉమాశంకర్ దాస్ వెల్లడిస్తూ…

(వాయిస్ 44 సెకన్లు)

======================

హైదరాబాద్ నగరంలో 72వ మిస్ వరల్డ్ పోటీలు ఈరోజు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 110కిపైగా దేశాలకు చెందిన పోటీదారులు ఈరోజు జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మిస్ ఇండియా నందిని గుప్తా భారత్ తరఫున ఈసారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన నిర్వహించారు. 2024 విజేత క్రిస్టినా పిస్కోవా తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.

======================
======================